



మూసాపేట మెట్రో స్టేషన్ కింద నిలిచిన వర్షపు నీరు

వర్ష బీభత్సం

అతలాకుతలమైన కూకట్‌పల్లి నియోజకవర్గం

- మూసాపేట మెట్రోస్టేషన్ వద్ద భారీగా నిలిచిన నీరు
- ఎక్కడికక్కడే వాహనాలు నిలిచిపోవడంతో భారీ ట్రాఫిక్ జామ్
- ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్‌కు అంతరాయం
- కాలనీల్లో పెద్ద ఎత్తున చేరుతున్న వరదనీరు
- ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- అండగా ఉంటామని ముంపు బాధితులకు హామీ



కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపు నీరు

మూసాపేట: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు కూకట్‌పల్లి నియోజకవర్గం అతలాకుతలమయ్యింది. మూసాపేట హైవే ప్రాంతం జలదిగ్బంధమైంది. కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో వద్ద హైవేపై వర్షపునీరు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. రెండు వైపులా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవటంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ఇటు కూకట్‌పల్లి వరకు, అటు ఎర్రగడ్డ వరకు భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ట్రాఫిక్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎర్రగడ్డ నుంచి మూసాపేట చౌరస్తా వరకు సుమారు రెండు గంటల సమయం పట్టడంతో వాహనదారులు నరకయాతన అనుభవించారు. కాలనీల గుండా వాహనాలు వెళ్లటంతో కాలనీల్లో కూడా ట్రాఫిక్ జామ్ అయ్యింది.

ఐడీఎల్ చెరువు పొంగడంతో..

◆ భారీ వర్షానికి ఐడీఎల్ చెరువు అలుగు నుంచి వచ్చే నీరు, వివిధ కాలనీలను కలుపుకొని నాలాల నుంచి ఆర్టీసీ డిపో వద్ద రోడ్డు క్రింద నుంచి పైపులైన్ల నుంచి హుస్సేన్‌సాగర్‌కు వెళ్లే నాలాలో కలుస్తాయి. అయితే ఆర్టీసీ డిపో వద్ద మెట్రో స్టేషన్ నిర్మాణం జరిగినప్పుడు పైపులైన్లు చిన్నవిగా వేయటం వల్ల వాటర్ సామర్థ్యం ఎక్కువ అవటంతో నీరు సాఫీగా ప్రవహించలేక ఆగిపోయింది. దీంతో జాతీయ రహదారిపై వర్షపు నీరు మోకాళ్ల లోతు నిలిచి పోయింది. వాహనాలు వెళ్లలేక ఎక్కడికక్కడ ఆగిపోవటంతో ట్రాఫిక్ సిబ్బంది నానా యాతనలు పడి డివైడర్స్‌ను తొలగించి నీరు సాఫీగా వెళ్లేవిధంగా కృషి చేస్తూనే ట్రాపిక్‌ను పునరుద్ధరించారు.

అపార్టుమెంట్ సెల్లార్లలోకి వర్షపునీరు

◆ అయితే ఐడీఎల్ చెరువు నుంచి వచ్చే నాలా పలు ప్రాంతాల్లో కబ్జాకు గురి కావటంతో పాటు, పెద్ద పెద్ద భవన నిర్మాణాలు, ఫంక్షన్‌హాల్ వంటి నిర్మాణాలు చేపట్టడంతో నాలా కుచించుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుకట్ట పడింది. దీంతో నాలా సమీపంలో ఉన్న పలు అపార్టుమెంట్ సెల్లార్‌లలోకి వర్షపు నీరు వచ్చి చేరింది. ఎప్పటికప్పుడు నీటిని ఎత్తి పారపోసినప్పటికి సెల్లార్‌లలో నీరు చేరింది. మూడు హెచ్‌పీ మోటార్స్ రెండు ఏర్పాటు చేసినప్పటికి కూడా నీరు నిలిచే ఉంది. నాల నుంచి వర్షపు నీరు పొంగి ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి నీరు ప్రవహించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు నీటి ప్రవాహం తగ్గక పోవటంతో సాయంత్రం వరకు వాహనదారుల ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నీట మునిగిన దీన్‌దయాల్‌నగర్..

◆ హుస్సేన్ సాగర్‌లో కలిసే నాలా ఆనుకొని ఉన్న దీన్‌దయాల్‌నగర్ కాలనీలోకి వరద నీరు భారీగా చేరింది. ఇళ్లలోకి నీరు చేరటంతో స్థానిక ప్రజలు అవస్థలు పడ్డారు. కనీసం వంట చేసుకోవటానికి కూడా ఇబ్బంది కలగటంతో ఆకలికి అలమటించారు. స్థానికంగా ఉన్న పలువురు నాయకులు పర్యటించి సహాయ చర్యల్లో పాల్గొని వారికి ఆహారం అందజేశారు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌పీ రోడ్డులో పలు అపార్టుమెంట్‌లలోకి వర్షపు నీరు చేరింది. మూసాపేటలోని పలు ప్రాంతాల్లో కూడా భారీ వర్షంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యాదవబస్తీ, ఈడబ్ల్యూయస్ తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరాయి.

అల్లాపూర్ డివిజన్‌లో పర్యటించని కార్పొరేటర్, అధికారులు

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అల్లాపూర్ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలైన రాజీవ్‌గాంధీ నగర్, సఫ్దార్‌నగర్‌లలో వర్షపు నీరు చేరటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షపు నీటితో పాటు మురుగునీరు సైతం ఇళ్లలోకి ప్రవేశించడంతో సామగ్రి నీట మునిగాయి. అకాల వర్షాలు పడినప్పుడల్లా కష్టాలు తప్పడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షపునీటిలో విష సర్పాలు సైతం వచ్చాయి. నీటిలో మునిగిన ప్రాంతాలను కనీసం అధికారులు సైతం పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శాశ్వత చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సెల్లార్లు జలమయం

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న భవన సెల్లార్లు జలమయం అయ్యాయి. మంగళవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి భాగ్యనగర్ కాలనీ, జయనగర్ కాలనీల్లోని సాయి నిలయం, జయేంద్ర అపార్టుమెంట్, ప్రియ అపార్టుమెంట్‌తో పాటు మరికొన్ని అపార్టుమెంట్‌ల సెల్లార్‌లో నీట మునిగాయి. కార్లు, ద్విచక్ర వాహనాలు సెల్లార్‌లో నీట మునిగాయి. ఆయా అపార్టుమెంట్‌లలో ఉన్న వాచ్‌మెన్‌ల గదిలోకి నీరు చేరి ఇంట్లో ఉన్న వస్తువులు మొత్తం తడిసి ముద్దయ్యాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ అధికారులను పిలిపించి సెల్లార్‌లోని వర్షపు నీటిని బయటకు పంపేందుకు చర్యలు చేపట్టారు.





జయానగర్‌లోని శ్రీనివాస టవర్స్, జయేంద్ర అపార్టుమెంట్‌లో నీట మునిగిన సెల్లార్లు

విద్యుదాఘాతంతో మహిళ మృతి



బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలో ఓ మహిళ ఫ్యాన్ స్విచ్ ఆన్ చేసేందుకు ప్రయత్నించగా విద్యుత్ ఘాతానికి లోనై మతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మాధవినగర్‌లో ఎండీ అస్లాం, షేక్ నిషాక్ పర్వీన్ (23) దంపతులు నివాసం ఉంటున్నారు. మంగళవారం రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వరద నీటి ముంపుకు గురైన తన ఇంటిని శుభ్రం చేసి ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్ స్విచ్ వేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది.

నీట మునిగిన ప్రాంతాలను పర్యవేక్షించిన జెడ్‌సీ మమత

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి నీట మునిగిన ప్రాంతాలను కూకట్‌పల్లి జోనల్ కమీషనర్ వి. మమత అధికారులతో కలిసి మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నీట మునిగిన పలు ప్రాంతాల్లో తక్షణ సహాయ చర్యలు చేపట్టారు. పారిశుద్ధ్య సిబ్బందితో మ్యాన్‌హోల్స్‌ను సరిచేయించి వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టారు. చెత్తా చెదారాన్ని తరలింప చేయించారు. వర్షాల కారణంగా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి సహాయ చర్యల్లో పాల్గొనాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



ఉషాముళ్లపూడి రోడ్డులో వర్షపు నీటిని తొలగింపజేస్తున్న జెడ్‌సీ మమత

సహాయక చర్యల్లో బీజేపీ నాయకులు



దీన్‌దయాల్‌నగర్‌లో సహాయ చర్యల్లో బీజేపీ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు



ఆహార పొట్లాలు పంచుతున్న ప్రేమకుమార్

బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు వర్షంలో కాలనీలో పర్యటించి వారి వర్షంతో ఏర్పడిన ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సహాయక చర్యల్లో పాల్గొని మంచి నీరు, భోజన వసతి వంటి సదుపాయాలు కల్పించాలరు. ప్రజా ప్రతినిధులు ఇటువంటి సమయంలో ప్రజల అవసరాలను పట్టించుకోకపోవటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని పేర్కొన్నారు. అనంతరం బీజేపీ నాయకులు ముమ్మారెడ్డి ప్రేమకుమార్ దీన్‌దయాల్‌నగర్‌లో వర్షంలో తడుస్తూ సహాయక చర్యల్లో పాల్గొని అల్పాహారం అందించి వారికి ధైర్యం చెప్పారు.

ముంపు ప్రాంతాల్లో కాంగ్రెస్ నేతల పర్యటన

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో పలు కాలనీలో నీట మునిగాయి. అధికార పార్టీ నిర్లక్ష్యం, అభివృద్ధిలో ముందు ఉన్నామని చెప్పుకునే నాయకులు ఈ దుర్భర పరిస్థితికి కారణమని కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఫతేనగర్, బాలానగర్ డివిజన్‌లలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. కోట్లు ఖర్చు పెట్టామని గొప్పలు చెప్పుకునే నాయకులు ప్రజలకు సరైన సమాధానం చెప్పాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు త్వరగా తాత్కాలిక చర్యలు చేపట్టాలని, లేదంటే అధికార పార్టీ నాయకులను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు.

◆ మూసాపేట వసుంధర ఆస్పత్రి వెనుక భాగం నుంచి వస్తున్న భారీ వరద నీటికి ప్రజలు రోడ్డు దాటేందుకు అవస్థలు పడుతుండటంతో వారికి మల్కాజ్‌గిరి పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మొయిజ్ రోడ్డు దాటే వారికి చేయి అందించి దాటించారు. వరద ప్రవాహం వల్ల చాలా మంది రోడ్డు దాటేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.





వరదనీటిని పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి

ఎమ్మెల్యే ఆదేశంతో సహాయక చర్యల్లో కార్పొరేటర్లు

కూకట్‌పల్లి: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఏవీబీ పురం కాలనీలో నీరు నిల్వ ఉండటంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. ఏవీబీ పురంలో పదేళ్ల క్రితం చిన్న వర్షానికి అంతా వరద నీటితో మునిగిపోయేదని ఎమ్మెల్యే కృష్ణారావు తొమ్మిది సంవత్సరాల కాలంలో ఏవీబీ పురంలో వరద నీరు ముంపుకు గురి కాకుండా చర్యలు తీసుకోవటంతో ప్రస్తుతం పడిన వర్షంలో ఇబ్బందులు లేకుండా జరిగిందన్నారు. అదే విధంగా రిటర్నింగ్ వాల్ కోసం నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభించి భవిష్యత్‌లో వర్షపు నీటితో ఎలాంటి ముంపు లేకుండా చేస్తామన్నారు.

బాలానగర్ డివిజన్‌లో...



బాలానగర్‌లో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరద నీరు తోడవటంతో బాలానగర్ డివిజన్‌లోని కళ్యాణ్‌నగర్, సాయినగర్, నవజీవన్‌నగర్, చరబండ రాజు కాలనీలు వరద వలయంలో చిక్కుకు పోయాయి. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అక్కడకు చేరుకొని ఇంటింటికి తిరిగి సహాయ చర్యలు చేపట్టి స్థానికులను పరామర్శించారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో...



ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని పలు కాలనీల్లో వరద నీరు చేరటంతో డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ మంగళవారం ఎల్లమ్మబండ ప్రధాన రహదారి, రాఘవేంద్రకాలనీ, ఆల్విన్ కాలనీ ఫేజ్ 2, ధరణినగర్ కాలనీల్లో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి అత్యవసరంగా పర్యటించి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరికి చెరువు నాలాలోని ప్రవాహ ఉధృతి పెరిగి వరద నీరు రివర్స్ వస్తుండటంతో రోడ్లపైకి వరద నీరు వచ్చి చేరిందని అన్నారు. వర్షాలతో ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రక్షణ, సహాయక చర్యలు తీసుకోవాలని కోరారు.

హైదర్‌నగర్ డివిజన్‌లో..



నిజాంపేట్ రోడ్డులో నీరు వెళ్లేందుకు పనులు చేపడుతున్న సిబ్బందితో కార్పొరేటర్ నార్నే

భాగ్యనగర్‌కాలనీ: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి దృష్టిలో ఉంచుకొని లోతట్టు ప్రాంతాల్లో జీహెచ్‌యం అధికారులతో కలసి పరిశీలించారు. డివిజన్ పరిధిలోని నిజాంపేట రోడ్డు, భాగ్యనగర్‌కాలనీ, అల్లాపూర్ సొసైటీ, సెవన్‌హిల్స్ కాలనీల్లో వర్ష ప్రభావం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉండే ప్రాంతాలను స్వయంగా పరిశీలించి సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. స్థానికుల ఫిర్యాదు మేరకు ఆయా కాలానీల్లో పర్యటించి మాన్‌సూన్ టీమ్‌ను అప్రమత్తం చేసి జేసీబీ సహాయంతో దిగువ ప్రాంతానికి వర్షపు నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. లోతట్టు కాలనీ ప్రాంత వాసులు తగు జాగ్రత్తలు పాటిస్తూ సమస్యను జఠిలంగా మారితే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో..



మనసా సరోవర్ హైట్స్ వద్ద వర్షపునీటి నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముద్దం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో వర్షం నీరు వలన మునుగుతున్న ప్రాంతాలలో వర్షం నీరు నిలువ ఉండకుండా ఇటీవల నిర్మించిన నాలాలను కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అధికారులతో కలసి పరిశీలించారు. వర్షాలు పడితే చిత్తడిగా మారి చిన్న పాటి చెరువులుగా మారే ప్రాంతాల ప్రజల ఇబ్బందులను గుర్తించిన ఎమ్మెల్యే వర్షపునీటి కాలువలను నిర్మించారు. అందులో మనసా సరోవర్ హైట్స్ ఒకటి. వర్షాలు పడినప్పుడల్లా అ ప్రాంతం నీట మునిగి అపార్టుమెంట్లలోకి నీరు చేరడంతో ప్రజలు బయటకు రాలేక రోజుల తరబడి ఇంట్లో ఉండాల్సి రావడం జరిగేది. ఏకంగా వర్షపునీటి ప్రవాహానికి వాహనాలు కొట్టుకుపోయేవి అలాంటి పరిస్థితుల నుంచి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో వర్షంనీటి నాలా నిర్మించడంతో ముంపు సమస్య నుంచి ప్రజలు బయట పడ్డారు.



మూసాపేటలో కురిసిన భారీ వర్షాన్ని పరిశీలించిన కార్పొరేటర్ మహేందర్



ఏవీబీ పురంలో ముంపు ప్రాంతంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

ఫతేనగర్ డివిజన్‌లో...

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ దీన్‌దయాల్‌నగర్, జింకల వాడలో మంగళవారం కురిసిన భారీ వర్షంతో పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరటంతో స్థానిక నాయకులు, కార్పొరేటర్ పర్యటించి పరిశీలించారు. దీన్‌దయాల్ నగర్‌లో స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ పర్యటించి బస్తీలోని వర్షపు నీటిని పరిశీలించారు. వర్షపు నీరు నిలిచిన కారణాలను ఉన్నతాధికారులకు వివరించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మూసాపేట డివిజన్‌లో యాదవబస్తీ, భరత్‌నగర్, ఈడబ్ల్యూఎస్‌లలోని వర్షపు ముంపు ప్రాంతాలను కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్ పరిశీలించారు. భారీ వర్షానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అభివృద్ధిని చూసి బీజేపీ, కాంగ్రెస్ ఓర్వలేకపోతున్నాయి

- కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ఒక వైపు అభివృద్ధి, మరోవైపు ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. మంగళవారం కూకట్‌పల్లి శేషాద్రినగర్ కమ్యూనిటీహాల్‌లో 125 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్‌లతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం భోజన ఏర్పాట్లు చేశారు.

◆ ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి ఆశీర్వాదంతో సుమారు 16వేల మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, రూ.40వేల మందికి పెన్షన్లు, సీఎం రిలీఫ్ ఫండ్ అందించామన్నారు. కాంగ్రెస్ పాలిస్తున్న కర్ణాటక, రాజస్థాన్‌లలో.. బీజేపీ పాలిస్తున్న మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఎక్కడైనా కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ప్రవేశపెట్టారా అని ప్రశ్నించారు. కేవలం మాయమాటలు చెప్పడానికి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పరిమితమయ్యాయని విమర్శించారు. అభివృద్ధి చేస్తున్న కేసీఆర్‌ను చూసి కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఓర్వలేకపోతున్నాయని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి కేసీఆర్ ప్రభుత్వాన్ని బలపర్చాలని ప్రజలను కోరారు.





చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన 125 మంది లబ్ధిదారులు

ఎమ్మెల్యే పాదయాత్రపై కార్పొరేటర్ సమావేశం

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాదయాత్ర సందర్భంగా బొట్టు విష్ణు ఆధ్వర్యంలో మంగళవారం దయార్‌గూడలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాల్గొని ఎమ్మెల్యే పాదయాత్రకు సంబంధించిన వివరాలను తెలిపారు. పర్యటనకు సంబంధించిన విషయాలపై దిశానిర్దేశం చేశారు.



నాయకులకు దిశానిర్దేశం చేస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

హ్యాండ్లూమ్ అండ్ క్రాఫ్ట్ మేళాకు విశేష స్పందన





కమ్యూనిటి హాలులో ఏర్పాటు చేసిన మేళాలో కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

మోతీనగర్: మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో కొనసాగుతున్న ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ అండ్ క్రాఫ్ట్ మేళాకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు అక్బర్ అలీ, గంగాధర్ పేర్కొన్నారు. ఈ మేళాలో దేశంలోని వివిధ రాష్ట్రాలలో స్వయంగా చేనేత కార్మికులు తయారు చేసిన చేనేత వస్త్రాలు మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, బగల్పూర్ చీరలు, డిజైనర్ చీరలు, హ్యాండ్, బ్లాక్ ప్రింటెడ్ చీరలు, కలంకారి, బెంగాల్ చీరలు, ఫ్యాన్సీ టాప్స్ డిజైనర్స్ బ్లౌజ్ లక్నో చికెన్ బనారస్ చీరలు ఖాదీ మెటీరియల్స్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యూవెలరీ, జైపూర్ బెడ్ షీట్స్, కొండపల్లి బొమ్మలు అందుబాటులో ఉన్నాయని ఎలిపారు. ఈ మేళా ప్రతి రోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అన్ని రకాల డెబిట్ క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేయవచ్చని పేర్కొన్నారు.

అన్నదానం

మోతీనగర్: అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పల్లపు వేణు అన్నారు. మంగళవారం ఆయన కేన్సర్ ఆస్పత్రి వద్ద అల్పాహారాన్ని అందజేశారు. ఎవరూ ఆకలితో ఉండొద్దనే ఉద్దేశంతో రోగులు వారి సహాయకులకు భోజనం అందజేస్తున్నామని పల్లపు వేణు తెలిపారు. కార్యక్రమంలో జాకీర్, సంతూ తదితరులు పాల్గొన్నారు.